క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్ : జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో టీచర్ డైరీని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ మంగళవారం ఆవిష్కరించారు. సోషల్ ఫోరం ఆధ్వర్యంలో టీచర్ డైరీ, ఇయర్ లెసన్ ప్లాన్, పీరియడ్ ప్లాన్ తయారు చేసి ఉపాధ్యాయులకు అందించడం సంతోషకరమైన విషయమని డీఈఓ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సీఎంఓ రమేష్, ఏఎంఓ లక్ష్మణ్, క్వాలిటీ కోఆర్డినేటర్ రాజగోపాల్, సోషల్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు పాతర్ల సతీష్, రాందస్ పాల్గొన్నారు.

‘విమర్శించడం సరికాదు’

మొగుళ్లపల్లి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరికాదన్నారు. చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రఫీ, నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్, యార రవి,తిరుపతిరెడ్డి, శివరెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సబ్ పోస్ట్‌మాస్టర్‌గా మధుకర్

కాటారం : తపాలా శాఖ కాటారం సబ్ పోస్ట్ మాస్టర్‌గా మండలంలోని గంగారం గ్రామానికి చెందిన ములుకల్ల మధుకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను బీపీఎంలు, ఇతర సిబ్బంది శాలువాతో సన్మానించారు.

చర్య తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్ : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొండ్ర సాయితేజ కోరారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు.

వానరానికి అంత్యక్రియలు



చిట్యాల : మండల కేంద్రంలో వానరం (కోతి) రోడ్డు దాటుతుండగా మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వానరం అక్కడికక్కడే మృతి చెందింది. ఈక్రమంలో మృతి చెందిన వానరాన్ని చూసి మరికొన్ని వానరాలు ఆ ప్రాంతానికి వచ్చి దూరంగా ఉండిపోయాయి. అవి వెళ్లిపోయిన అనంతరం మండల కేంద్రానికి చెందిన హనుమాన్ భక్తులు వల్లాల ప్రవీణ్, గోల్కొండ అజయ్, బండి రాజు వానరాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి చలివాగు ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించారు.

గుంతలరోడ్డుతో అవస్థలు



చిట్యాల: గుంతలమయమైన రోడ్డు



మల్హర్: బురదగా తాడిచర్ల సుంకరపల్లి రోడ్డు

● పట్టించుకోని అధికారులు

చిట్యాల : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామ కూడలిలో రోడ్డుపై గుంతలు పడి బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఏదైనా అనుకొని ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదునెలల క్రితం రోడ్డుపై తూతూమంత్రంగా మళ్లీ తారువేసి వెళ్లారు. కానీ నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో గుంతలు ఏర్పడి బురద రోడ్డుగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి గ్రామ కూడలి వద్ద తారు వేసి ప్రయాణికులకు, వాహనదారులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రోడ్డు పనులకు మోక్షం లభించేనా?

మల్హర్ : మండలంలోని తాడిచర్ల, సుంకరిపల్లి నుంచి వెంచరామి వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు నిధులు లేక నిలిచిపోయింది. తాడిచర్ల,సుంకరపల్లి నుంచి కాపురం మీదుగా చిట్యాల మండలం వెంచరామి (అందుగులపల్లి) వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 2018, మార్చి 30న అప్పటి మంథని ఎమ్మెల్యే పుట్ట మధు రూ. 9 కోట్లతో శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తాడిచర్ల పెద్దమ్మ గుడి క్రాస్ నుంచి కాపురం చెరువు వరకు మట్టి రోడ్డు పోశారు. కానీ నిధుల జాప్యంతో పనులు ముందుకు సాగలేదు. పనులు నిలిచి సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు నిర్మాణాపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే చిట్యాల మండలం వెంచరామి మీదుగా వరంగల్‌కు తక్కువ దూరంలో చేరుకుంటారు. జిల్లా అధికారులు స్పందించి నిధులు కేటాయించి రోడ్డు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే!

రేగొండ : కొత్తపల్లిగోరి మండలంలోని జంషెడ్ బేగ్‌పేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్ల అంచనా వ్యయంతో గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. కాగా పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి రోడ్డు పనులను సోమవారం నుంచి మొదలు పెట్టాడు. దీంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం సాయంత్రం బురదలో చిక్కుకున్న టిప్పర్‌ను పొక్లెయినర్ సాయంతో బయటకు తీశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



టిప్పర్‌ను బయటకు లాగుతున్న పొక్లెయినర్



బురదలో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

మంత్రులను కలిసిన నాయకులు



మంత్రితో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

కాటారం : రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకరంగా కలిసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ తెలిపారు. మంత్రులను శాలువాలతో సన్మానించిన అనంతరం రాష్ట్రంలో గిరిజనులు, ఆయా శాఖల్లో పని చేస్తున్న గిరిజన ఉద్యోగుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గురుకులాల్లో 24 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న 450 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగుల టైం స్కేల్ ఇంప్లిమెంట్ చేయడంతో పాటు 12 నెలల జీతాలు అందజేయాలని గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఇతర సమస్యలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు విన్నవించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు పూల్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అజ్మీరా సుశీలబాయి, ఉపాధ్యక్షుడు బానోత్ శ్రీనివాస్ నాయక్, తేజావత్ రాందాస్, కిషన్ నాయక్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

● పాఠశాలకు నేమ్ బోర్డు బహూకరణ



పాఠశాల నేమ్ బోర్డు వద్ద ప్రధానోపాధ్యాయుడు కృష్ణ తదితరులు

చిట్యాల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ కోరారు. మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.25వేల విలువైన నేమ్ బోర్డును మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు పాఠశాలకు నేమ్ బోర్డు ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులే ఉన్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కలిగి ఉంటున్నాయని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కోరుకోప్పుల కావ్య, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, మాజీ ఎంపీటీసీలు జంబుల తిరుపతి, చంద్రమౌళి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ దొంతి రాంరెడ్డి, పీఎస్ ప్రధానోపాధ్యాయులు సునీత, పూర్వ విద్యార్థులు మేదరి సునీల్, ఆకుల శ్రీనివాస్, తాళ్ల కిరణ్, రమేష్, అశోక్, నర్సింగరావు, కుమార్ రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న రాంమోహన్‌రావు

చిట్యాల : రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని విశ్రాంత ఏడీఏ రాంమోహన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పోతన ఎన్జీఓ వరంగల్ ఆధ్వర్యంలో జాతీయ సుగంధ ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిర్చి, పసుపు పండించే రైతులు తమ భూమిలో శక్తివంతంగా ఉండే విధంగా పచ్చిరొట్ట, పశువుల విసర్జాలు, వేప పిండి, ట్రైకోడార్మాలను వాడాలన్నారు. దీంతో పంటలను సోకే క్రిములను నిర్మూలించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, నేషనల్ సీడ్ సొసైటీ ఫార్మర్ కన్సల్టెంట్ ఉపేందర్‌రెడ్డి, ఏఈఓ సన్నీ, రైతులు కోడెల సమ్మయ్య, చాడ సమ్మిరెడ్డి, కనుకుల రాంరెడ్డి, కంచర్ల కిషయ్య, గౌడుగు శ్రీనివాస్, మెరుగు సమ్మయ్య, నల్లా శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



రంజిత్



షఫీ

కాటారం : కాటారం డివిజన్ పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాటారం, మహదేవపూర్, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు స్థానిక బీఎల్ఎం గార్డెన్‌లో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అడప రమేశ్, అధ్యక్షుడిగా పెండ్యాల రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వీరమనేని సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షఫీక్ హైమద్, సహాయ కార్యదర్శులుగా ములుకల్ల రాజబాబు, కోళ్ల మహేశ్, కోశాధికారిగా షేక్ దీన్ మహమ్మద్, కార్యవర్గ సభ్యులుగా బత్తుల మహేశ్, కీర్తి శ్రావణ్, కొక్కు సాకేత్, బాసాని రాజబాబు, సభ్యులుగా సయ్యద్ జమీల్, వేల్పుల వెంకటేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు రంజిత్ తెలిపారు.

అమ్మ పేరుతో మొక్క నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్ : అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని బీజేపీ జిల్లా నాయకుడు దొంగల రాజేందర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు బూర పద్మ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మ పేరు మీద ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేందర్, మహిళా నాయకురాలు వేశాల సత్యవతి హాజరై ప్రజలకు మొక్కలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 11సంవత్సరాల పరిపాలనలో భాగంగా దేశమంతా అమ్మ పేరుతో మొక్కలు నాటాలని భారతీయ జనతా పార్టీ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని అందులో భాగంగానే మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. నాయకులు ఊరటి మునీందర్, బూర రమేష్, హైమావతి, శ్రీదేవి, దూలం మొండయ్య, సుమలత, శంకర్, ఆవుల సంతోష్, నాంపల్లి కుమార్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



గణపురం : మండలంలోని లక్ష్మారెడ్డిపల్లెలో ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందిన రైతు ఓద్దుల రాంరెడ్డి మృతదేహానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మంగళవారం లక్ష్మారెడ్డిపల్లెకి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్ రెడ్డి, నాయకులు పొలసాని లక్ష్మీనరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రా రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇరాన్‌పై దాడిని ఖండించాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

భూపాలపల్లి అర్బన్ : ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాద దాడులను ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు ఇరాన్ దేశంపై యుద్ధం వెంటనే ఆపాలని కోరారు. ప్రపంచ దేశాలు శాంతి నెలకొల్పాలన్నారు. సామ్రాజ్యవాదం కోసం అమెరికా ప్రభుత్వం పశ్చిమాసియాపై ఆధిపత్యం చేసుకోవా లనే దురుద్దేశంతో ఇరాన్‌పై దాడులు చేయించడం జరుగుతుందన్నారు. యుద్ధాలతో వేలాదిమంది ప్రజలు అన్యాయంగా చనిపోతున్నారని, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరుగుతుందని తెలిపారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు అని ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మాతంగి రాంచందర్, సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, రవికాంత్, తిరుపతిలు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

టేకుమట్ల : ప్రతీ ఒక్కరు బ్యాంక్ ఋణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆకినపల్లి ఫీల్డ్ ఆఫీసర్ అంజన్న, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రాఘవరెడ్డిపేటలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవడం ద్వారా 7శాతం మాత్రమే వడ్డీ పడుతుందని అన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు తీసుకోవడం వల్ల సొమ్ము భద్రంగా ఉండడంతో పాటు, బ్యాంక్ వడ్డీని సైతం చెల్లిస్తుందని తెలిపారు. అలాగే బ్యాంక్ పాలసీల ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన తక్కువ ప్రీమియంతో చెల్లించే సదుపాయం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మిత్ర రవి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ములుగు రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్‌కుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పెగడపల్లిలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటి ఫీవర్ సర్వేను, యాంటి లార్వా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విపిన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నీటి నిల్వల ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ వేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్‌రావు, నందకిషోర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం మహిళలకు వైద్యాధికారి స్నేహ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. 74 మంది మహిళకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



గణపురం: ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ తదితరులు



టేకుమట్ల: పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



కాటారం: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, చైర్మన్, నాయకులు



భూపాలపల్లి రూరల్: కొంపెల్లి రైతు వేదికలో..



చిట్యాల: రైతువేదికలో..

గణపురం : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించిన రైతు భరోసా సంబురాల కార్యక్రమానికి గండ్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తుందన్నారు. 9రోజుల్లో 100 శాతం రైతు భరోసా నిధులు విడుదల పూర్తవుతుందన్నారు.

సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

గణపురంలోని రైతు వేదికలో రైతు భరోసా సంబురాల్లో కలెక్టర్ రాహుల్‌శర్మతో పాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం ఆవరణ నుంచి నిర్వహించిన రైతు భరోసా సంబురాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బాబు, ఉద్యానవన శాఖ అధికారి సునీల్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్, గణపురం సింగిల్ విండో చైర్మన్ కుమార్ యాదవ్‌తో పాటు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని జూకల్ రైతు వేదికలో రైతు భరోసా సంబురాలు మంగళవారం అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు రమణకుమార్, సన్నీ, దీపక్, రైతులు ఆదిరెడ్డి, ఆకుల రవీందర్, చిలుకల రాయకోంరు. నల్లా శివరామకృష్ణ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటారం : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని కాటారం పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ రైతుభరోసాతో రైతుల కళ్లలో ఆనందం నెలకొందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పూర్ణిమ, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే రైతులకు భరోసా

టేకుమట్ల : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుకు భరోసా అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు వేదికలో రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జంపయ్య, జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి చల్లగొండ శ్రీకాంత్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం దాడి చేశారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం. నార్లాపూర్ గ్రామానికి చెందిన విలేకరి శ్రీకాంత్‌రెడ్డి వార్తల సేకరణ కోసం తాడ్వాయికి వచ్చి తిరిగి వెళ్తుండగా సారలమ్మ గుడి దాటిన తర్వాత బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తండాల శ్రీనివాస్, మొక్క శ్రీనివాస్, బొప్ప వినోద్, సంకే శ్రావణ్, ఎనగంటి సాయికృష్ణలు వెనకల కారులో వచ్చి సెల్ ఫోన్ లాక్కొని దాడి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో వ్యతిరేకంగా వార్తాలు రాస్తావా అంటూ కొట్టారు. చంపాలనే ప్రయత్నం చేయగా వారి తప్పించుకున్నట్లు తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



బాలికలకు చిక్కీలు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకుమట్ల : కిశోర బాలికలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు కిశోర బాలికలకు చిక్కీలు అందించారు. బాలికలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి, స్వరూప, పూర్ణిమ, లావణ్య, ఉపాధ్యాయులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ములుగు రూరల్ : ప్రభుత్వ విద్యా విధానాన్ని ప్రతిఘటిస్తూ ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని గన్‌రెడ్డి ఆదిరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : పాఠశాలల్లో విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనను విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగ నరేందర్‌కుమార్, మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు సమ్మయ్య, వెంకటలక్ష్మి, సునీత మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 27వతేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.